నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల వనపర్తి
10 | మహబూబ్‌నగర్, బుధవారం 19 మార్చి 2025 | JOGULAMBA GADWAL WANAPARTHY

తాగునీరు రావడం లేదని ఖాళీ బిందెలతో నిరసన తెలియజేస్తున్న కొన్నూరు బుడగ జంగం కాలనీవాసులు

గొంతెండుతున్నా పట్టించుకోరా..?

- ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించిన కొన్నూరు బుడగ జంగం కాలనీవాసులు

మదనాపురం, మార్చి 18 : తాగునీటి సమస్యలను పరిష్కరించాలని మండలంలోని కొన్నూరు గ్రామం బుడగ జంగాల కాలనీవాసులు డిమాండ్ చేశారు. 200 వందల కుటుంబాలు ఉన్న కాలనీలో కొన్ని రోజులుగా మిషన్ భగీరథ నీళ్లు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటిని సరఫరా చేయాలని కోరుతూ మంగళవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాది కిరణ్ మాట్లాడుతూ ఒకరోజు అన్నం లేకున్నా మనిషి బతుకు తాలేమో కానీ.. నీరు లేకుంటే మనిషి బతకడం కష్టం అన్నారు. కాలనీ వాసులతో పాటు మూగ జీవాలకు కూడా నీరు దొరకడం లేదని విచారం వ్యక్తం చేశారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి కోసం ప్రజలు గ్రామ సమీపం లోని పంట పొలాల నుంచి నీటిని తెచ్చుకోవాల్సి వస్తుందని, తెచ్చుకొనే క్రమంలో రైలు పట్టాలు దాటాల్సి వస్తుందని, దీంతో ఎప్పుడు ఏప్రమాదం జరుగుతుందోనని తెలియడం లేదన్నారు. కాలనీలో ఉన్న మినీ వాటర్ ట్యాంకులో మిషన్ భగీరథ నీళ్లతో పాటు బోరు నీళ్లు కలిపి వదలడం వలన ప్రజలు అనారోగ్య బారిన పడుతున్నారని, తక్షణమే అదనంగా మరో ట్యాంకు ఏర్పాటు చేసి కాలనీకి సరిపడా తాగునీటిని సరఫరా చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాలనీవాసులు గ్రామస్తులు పాల్గొన్నారు.

రైలు పట్టాలు దాటి మంచినీళ్లు తెస్తున్న మహిళలు

మా ఊరి ఇసుక తరలించనీయం

ఇసుక తరలించొద్దని మూకుమ్మడిగా తీర్మానం చేసి అధికారులకు అందజేస్తున్న ఏటిధర్‌పల్లి వాసులు

- ఏటిధర్‌పల్లి వాసుల తీర్మానం
- తీర్మానం ప్రతి అధికారులకు అందజేత
- కాదంటే ఆత్మహత్య చేసుకుంటామని పురుగు మందు డబ్బాలతో హెచ్చరిక

తాడూరు, మార్చి 18 : మండలంలోని వివిధ గ్రామాల్లో ఇసుక కొరత ఏర్పడుతున్న నేపథ్యంలో ఉన్న తాధికారుల ఆదేశానుసారం ఇసుక కొరత తీర్చేందుకుగాను తాడూరు మండలంలోని ఏటిదర్పల్లి గ్రామ సమీపంలో దుందుభీ నదిలో ప్రభుత్వం సూత్రప్రాయంగా ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు మంగళవారం రచ్చకట్ట వద్ద సమావేశం అయ్యారు. ఈ క్రమంలో సమాచారానికి రెవెన్యూ, పోలీసు, మైనింగ్‌శాఖ అధికారులు హాజరై ఇసుక రీచ్ ఏర్పాటుకు సహకరించాలని రైతులు, గ్రామస్తులకు వివరించే ప్రయత్నం చేశారు. అయితే గ్రామస్తులు మాత్రం ఇసుక రీచ్ ఏర్పాటు చేస్తే పురుగు మందు తాగి చనిపోతామంటూ హెచ్చరించారు. అంతేకాదు కొంత మంది మహిళలు పురుగు మందు డబ్బాలు పట్టుకొని అధికారుల ముందుకు రావడంతో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. అంతలోనే పోలీసులు కలుగజేసుకొని మీ అనుమతి లేకుండా ఇసుకను తరలించమని చెప్పడంతో సమస్య కాస్త సద్దుమణిగింది. అనంతరం గ్రామస్తులందరూ పెద్దల మనుషుల సమక్షంలో మా ఊరికి సంబంధించి దుందుభీ నదిలో ఇసుక రీచ్ ఏర్పాటు చేయకూడదంటూ తీర్మానం చేసి ఆ తీర్మానం కాఫీని ఆర్ఐ సమీర్, సురేశ్, మైనింగ్ శాఖ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ దుందుభీ నదిలో నుంచి ఇసుక తీసినట్లయితే భూగర్భ జలాలు తగ్గి బోర్లు పాడై సాగు చేసిన పంటలన్నీ ఎండిపోయే పరిస్థితి ఉందన్నారు. కావున ఉన్న తాధికారులు స్పందించి మా ఊర్లో ఇసుక రీచ్‌న ఏర్పాటు చేయవద్దని కోరారు. ఇసుక రీచ్‌కు సంబంధించి స్థానిక ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డితో పాటు ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని గ్రామస్తులు తెలిపారు.

కోయిల్‌సాగర్ నీళ్లు అందించండి

- ఎండుతున్న వరి పంటలను కాపాడండి
- కలెక్టర్ విజయేందిరబోయికి డోకూరు రైతుల వినతి

డోకూర్‌లో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిరబోయి

దేవరకద్ర, మార్చి 18 : డోకూర్ శివారులో ఎండిన పంటను మంగళవారం కలెక్టర్ విజయేందిర బోయి పరిశీలించారు. గ్రామానికి కోయిల్‌సాగర్ ఎడమ కాల్వ నుంచి నీళ్లు విడుదల చేశారా? అని ఆరా తీశారు. రైతులు మాట్లాడుతూ గతంలో ప్రాజెక్టు ఆయకట్టుకు నీళ్లు వదిలినప్పుడు డోకూర్‌కు రెండ్రోజులు వదలడంతో ప్రయోజనం ఉండేదని గుర్తు చేశారు. ప్రాజెక్టులో 16 అడుగులు ఉన్నప్పుడు కాల్వకు నీళ్లు వదిలేదని, కానీ ప్రస్తుతం 20 అడుగులు ఉన్నా సాగునీరు ఇవ్వడం లేదని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఇందుకు స్పందించిన ఆమె మాట్లాడుతూ ప్రాజెక్టులో ఉన్న నీటిని తాగునీటి అవసరాల కోసం నిల్వ ఉంచినట్లు, ఇప్పుడు సాగునీటి విడుదల సాధ్యం కాదని చెప్పారు. ఏది ఏమైనా చివరి దశలో ఉన్న పంటలు కాపాడేందుకు కోయిల్‌సాగర్ నీరు ఇవ్వాలని విన్నవించారు. ఆమె వెంట తాసీల్దార్ కృష్ణయ్య, ఏడీఏ యశ్వంత్‌రావు, ఎంపీడీవో శ్రీనివాస్‌రావు, ఏవో రాజేందర్ అగర్వాల్, ఏఈ కీర్తి తదితరులు ఉన్నారు.

వదినామరదళ్ల పరస్పర దాడులు

- మరదలు మృతి
- నారాయణపేట మండలం జలాల్‌పూర్‌లో ఘటన

నారాయణపేటరూరల్, మార్చి 18 : వదిన మరదళ్లు పరస్పర దాడులు చేసుకోగా అందులో మరదలు మృతి చెందిన ఘటన మండలం లోని జిలా జాపూర్‌లో మంగళవారం ఉదయం చోటు చేసుకున్నది. ఎస్సై వెంకటేశ్వర్లు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. జిలా జాపూర్ గ్రామానికి చెందిన మాణిక్యప్ప కూతురు బుజ్జమ్మను 15 ఏండ్ల కిందట నసలవాయి గ్రామానికి చెందిన రాజుతో వివాహం జరుగగా రెండేళ్ల తర్వాత విడిపోయి తన అన్న రాంచంద్రప్ప వద్ద ఉంటున్నది. ఆమె ఉపాధి హామీ నర్సరీలో పనిచేస్తు జీవనం సాగిస్తున్నది. అయితే అదే గ్రామానికి చెందిన మొగులప్పతో అక్రమ సంబంధం ఉన్నదని రాంచంద్రప్ప భార్య లక్ష్మి బుజ్జమ్మతో తరుచూ గొడవపడేది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం లక్ష్మి నర్సరీకి వెళ్లి బుజ్జమ్మతో గొడవపడింది. ఈ సందర్భంగా లక్ష్మి బుజ్జమ్మపై రాయితో దాడి చేయగా ఆమె అపస్మారక స్థితికి చేరుకొని మృతి చెందింది. ఘటనా స్థలాన్ని సీఐ శివశంకర్ పరిశీలించి వివరాలు సేకరించారు. అయితే తన చెల్లెలు బుజ్జమ్మ మృతికి కారణమైన భార్య లక్ష్మిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని రాంచంద్రప్ప ఫిర్యాదు చేయగా ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

నీళ్లులేక పొట్ట దశలో ఎండుతున్న వరి పొలంలో దిగాలుగా రైతులు

ఆశలు ఆవిరే..!

- పాతాళానికి జలం.. ఎండిన పొలం
- బోరుబావుల్లో పడిపోయిన నిల్వలు
- సరిపడా నీళ్లులేక పొలాల్లో నెర్రెలు
- బోర్లు వేసినా కానరాని నీటిజాడ
- కాల్వల నీరు అందకుంటే కష్టమే..
- ఆందోళన చెందుతున్న రైతులు
- అప్పులే మిగిలాయంటూ ఆవేదన

కాల్వలో పేరుకుపోయిన మట్టిని తొలగిస్తున్న రైతులు



వడ్వాట్ సమీపంలో వట్టిబోయిన సంగంబండ లెఫ్ట్ కెనాల్‌లో రైతు

మాగనూరు, మార్చి 18 : మాగనూరు, కృష్ణ ఉమ్మడి మండలంలో భూగర్భ జలాలు గణనీయంగా తగ్గిపోయాయి. దాదాపు 75 శాతం బోర్లు అడుగంటాయి. 24 గంటల పాటు వ్యవసాయానికి కరెంట్ సరఫరా చేసినా లాభం లేదని.. నీళ్లులేక పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. కాల్వల్లోనైనా నీళ్లు పారితే పంటలు చేతికందేవని, కానీ ఆ పరిస్థితి లేదని వాపోయారు. ప్రజాప్రతినిధులు, అధికారుల ముందుచూపు కరువైన కారణంతో సంగం బుడ రిజర్వాయర్ కాల్వలు నీళ్లులేక వెలవెలబోతున్నాయి. కుడి కాల్వలో అయితే చివరి ఆయకట్టు రైతులకు చుక్క నీరు కూడా అందక పంటలు ఎండుముఖం పట్టాయి. రిజర్వాయర్‌లో 20 లేదా 30 హార్స్‌పవర్ మోటర్లు పెట్టి సాగునీరు కాల్వల ద్వారా పారిస్తే చివరి ఆయకట్టుకు నీరందే అవకాశం ఉంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో నాటి మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి సంగం బుడ రిజర్వాయర్‌లో రైట్ హై లెవెల్ కెనాల్‌కు సాగునీరు అందకపోతే 20 హార్స్ పవర్ మోటార్లు పెట్టి సాగునీరు పారించాలని గుర్తు చేశారు. ప్రస్తుతం పంటలు ఎండుతున్నా ప్రభుత్వం గానీ.. అధికారులు గానీ.. స్పందించడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.

కాల్వల్లో తుంగ, పూడిక తీయకపోవడంతోనే..

సంగం బుడ రిజర్వాయర్ లెఫ్ట్ లో లెవెల్ కెనాల్‌లో రూ.40 లక్షలతో అడ్డుగా ఉన్న పెద్ద బండరాయిని తొలగించారు. కానీ కాల్వలో పేరుకుపోయిన తుంగ, పూడికను తీయలేదు. దీంతో ఓబులాపూర్ గేటు సమీపం వరకు సక్రమంగా నీరు అందడం లేదని రైతులు వాపోతున్నారు. కొందరు ఓబులాపూర్ రైతులు.. వడ్వాట్ రైతులు కలిసి కాల్వలో పేరుకపోయిన తుంగను తొలగించారు. అయినా సాగు నీరు సరిగ్గా రావడం లేదు. దీంతో పలు చోట్ల పంటలు ఎండుతున్నాయి. వడ్వాట్‌కు చెందిన నరసింహాగౌడ్ పొలం నాలుగు గుంటలు నీళ్లులేక నెర్రెలు బారింది. అదే గ్రామానికి చెందిన మరికొందరి పొలాలలో పంటలు ఎండాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కాల్వలకు నీళ్లు వదిలితేనే పంటలు చేతికందే పరిస్థితి కనిపించడం లేదు.

ఎండిన పంట.. రైతన్నకు తంటా..

- అడుగంటిన భూగర్భ జలాలు
- దిక్కుతోచని పరిస్థితులో రైతులు

ధన్వాడ, మార్చి 18 : రోజురోజుకు ఎండలు ముదురుతుండడంతో భూగర్భ జాలాలు అడుగంటుతున్నాయి. అన్నదాతలు పంటలకు నీరు అందక పోవడంతో అవస్థలు పడుతున్నారు. మండలంలోని రామకిష్టయ్యపల్లి గ్రామంలో వరి పంటకు సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయి. దీంతో చేసేది లేక ఎండిన పంటలను గొర్రెలను మేపుతున్నారు. గతంలో పుష్కలంగా నీరు ఉండగా రెండు పంటలు సాగు చేసుకున్నారు. ప్రస్తుతం భూగర్భ జాలాలు అడుగంటిపోతుండడంతో రైతులకు గుండె కోతలు తప్పడం లేదు. రామకిష్టయ్యపల్లి గ్రామానికి చెందిన రైతు దామోదర్‌రెడ్డి బోరులో నీటి మట్టం తగ్గడంతో రైతు సాగు చేసిన వరి పంట ఎండిపోయిందని కన్నీరు పెట్టుకుంటున్నాడు. రెండున్నర ఎకరాల్లో వరి పంట సాగు చేస్తే భూగర్భ జాలాలు అడుగంటడంతో పంట ఎండిపోయింది. పంటను కాపాడుకునేందుకు రూ.2లక్షలు వెచ్చించి బోరు వేసినా చుక్కనీరు రాకపోవడంతో పంట కోసం, బోరు కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలని ఆందోళనకు గురవుతున్నాడు.

చంద్రాయన్‌పల్లిలో ఎండిపోయిన వరి పంటలో రైతు

రామకిష్టయ్యపల్లిలో ఎండిన పొలంలో దామోదర్‌రెడ్డి, చారకొండ మండలంలో ఎండిపోయిన జొన్న

వట్టిపోతున్న బోర్లు, బావులు

చారకొండ, మార్చి 18 : ఎటుచూసినా ఎండిన చెరువులు.. వట్టిపోయిన బోర్లు, బావులు.. అడుగంటిన భూగర్భ జలాలు.. నెర్రెలు వారిన పంటలు.. వేలకు వేలు పోసి వందల అడుగులు తవ్వినా పడని బోర్లు.. చివరి దశలో ఉన్న పంటలను కాపాడుకునేందుకు రైతుల తాపత్రయం.. ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి.. కాల్వల ద్వారా నీరు అందక.. బోర్ల నుంచి రాక.. దీనికి తోడు కరెంట్ సమస్యలతో పంటలు మార్చిలోనే ఎండుముఖం పడుతున్నాయి. నీటినిల్వలు గణనీయంగా తగ్గిపోవడంతో 70 శాతానికి పైగా పంటలు ఎండిపోయాయి. రైతులు ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంటలు చేతికొచ్చే దశలోనే ఎండుముఖం పట్టడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. కొందరైతే నీటిని అందించలేక పంటలను పశువులు, గొర్రెల మేతకు వదిలేసిన పరిస్థితులు చారకొండ మండలం లోని కనిపిస్తున్నాయి. మొత్తం 2,121 ఎకరాల్లో వరి, మక్కలు 60 ఎకరాలు, జొన్నలు 164 ఎకరాలు, ఆముదాలు 176 ఎకరాలు, వేరుశగ 1,624 ఎకరాలు, కందులు 60 ఎకరాలు సాగైంది. అయితే నీటి నిల్వలు తగ్గిపోవడంతో ఎక్కడా పంటలు పూర్తి స్థాయిలో చేతికొచ్చే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో పంటలను ఎలాగైనా రక్షించుకోవాలన్న తాపత్రయంతో ఒక్కో రైతు 400 నుంచి 500 ఫీట్ల వరకు బోర్లు వేస్తున్నా నీటి జీడలు మాత్రం కనిపించడం లేదు.

పదేండ్లలో చూడలేదు

కేసీఆర్ ప్రభుత్వ హయంలో పదేండ్లలో ఇలాంటి పరిస్థితి రాలేదు. గతంలో బోర్లు, బావులు ఎండిపోకుండా వర్షాలు బాగా పడ్డాయి. నేను రెండెకరాల్లో వరి సాగు చేశాను. బోరు మొదట్లో బాగా నీరు పోసేది. ప్రస్తుతం తగ్గుముఖం పట్టి మధ్యలోనే నీళ్లు పోయకుండా ఆగిపోతుండడంతో ఎకరా పంట పూర్తిగా ఎండింది. అప్పులు చేసి సాగుబడులు చేసినా నష్టాలు తప్పడం లేదు. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలి.

- రాంలాల్‌నాయక్, అగ్రహారంతండా, చారకొండ మండలం, నాగర్‌కర్నూల్ జిల్లా

అప్పులు తెచ్చి సాగు చేశాను

భూగర్భజలాలు పూర్తిగా తగ్గిపోయాయి. నేను ఎకరాలో వరి, రెండెకరాలలో జొన్న పంట వేశాను. ఉన్న ఒక్క బోరులో నీళ్లు రాకపోవడంతో జొన్న, వరి పూర్తిగా ఎండిపోయింది. 20 రోజులైతే చేతికి అందే పరిస్థితి.. అప్పులు చేసి సాగుబడులు చేసినా.. చేసిన అప్పులు పెరుగుతున్నాయి.. ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు. అధికారులు పంటలను పరిశీలించి ప్రభుత్వం నుంచి పరిహారం అందించి ఆదుకోవాలి.

- బిచ్యానాయక్, వంకరాయితండా, చారకొండ మండలం, నాగర్‌కర్నూల్ జిల్లా

ప్రభుత్వానికి నివేదిక పంపిస్తాం

భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో రైతులు సాగు చేసిన వివిధ పంటలు ఎండిపోయాయి. ఇప్పటి వరకు 23 ఎకరాల వరకు వరి ఎండిపోయిన్నట్లు గుర్తించాం. మిగితా గ్రామాల్లో పర్యటించి ఎండిన పంటలను పరిశీలిస్తున్నాం.. తర్వాత ప్రభుత్వానికి నివేదిక పంపిస్తాం. ఇంకా పంటలను పరిశీలిస్తున్నాం.. మిగితా వివరాలు కూడా సేకరిస్తాం.. రైతులు ఆందోళన చెందొద్దు..

- తనూజరాజ్, ఏవో చారకొండ, నాగర్‌కర్నూల్ జిల్లా

కావేరమ్మపేటలో వ్యక్తి దారుణ హత్య

జడ్చర్లటౌన్, మార్చి 18 : జడ్చర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని కావేరమ్మపేటలో ఓ గుర్తు తెలియని వ్యక్తి(45) దారుణ హత్యకు గురయ్యాడు. మున్సిపాలిటీ కార్యాలయానికి సమీపంలోని కావేరమ్మపేట సంత మైదానం వద్ద రోడ్డు పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని మంగళవారం కావేరమ్మపేటవాసులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. జడ్చర్ల సీఐ కమలాకర్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మహబూబ్‌నగర్ నుంచి క్లూస్‌టీం, డాగ్‌స్కాడ్‌ను రప్పించి విచారణ చేపట్టారు. ఆ తర్వాత మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల మార్చురీకి తరలించారు. మృతుడి తలపై ఉన్న గాయాల నేపథ్యంలో హంతకులు బండరాయి లేదా ఏదైనా కట్టెతో బాది చంపినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు. కావేరమ్మపేట సంత మార్కెట్ వద్ద ఇటీవల ఓ గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందగా ఇప్పుడు మరో గుర్తు తెలియని వ్యక్తి హత్యకు గురికావటంపై పట్టణవాసులు ఆందోళన చెందుతున్నారు. వరుస సంఘటనలపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

భూమి హక్కు కల్పించాలని..

- తాసీల్దార్ కార్యాలయం ఎదుట దాచక్‌పల్లి రైతుల దీక్ష

హన్వాడలో దీక్ష చేపట్టిన దాచక్‌పల్లి రైతులు

హన్వాడ, మార్చి 18 : మండలం లోని దాచక్‌పల్లి గ్రామ సమీపంలో సర్వే నెం 36లో తమకు భూమి హక్కు కల్పించాలని రైతులు డిమాండ్ చేశారు. భూమి హక్కు కల్పించే విషయంలో జిల్లా కలెక్టర్ ఆదేశాలను తాసీల్దార్ పట్టించుకోవడం లేదని మంగళవారం తాసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అల్వాల్‌రెడ్డి మాట్లాడుతూ దాచక్‌పల్లి గ్రామ సమీపం లోని సర్వే నెం 36లో 6ఎకరాల 16 గుంటల భూమి ఉందని, వీటిలో ఒక భాగం కర్రె బాలప్ప కుమారులు పెద్ద భీమయ్య, చిన్న చెన్నయ్య, వీరయ్య, నాగయ్య, బాల కిష్టయ్య అందరూ కలిసి 2ఎకరాల 8గుంటల భూమిని ఓ గిరిజన వ్యక్తికి అమ్ముకున్నారు. కానీ ఈయనకు 3ఎకరాల 18గుంటల భూమి రిజిస్ట్రేషన్ అయింది. రెండో భాగంలో మిగతా 3 ఎకరాల 8గుంటల భూమి మునెమ్మ, కర్రె సాయన్న, టంకర సాయన్న పేర్ల మీద ఉండగా కర్రె బాలప్ప కుమారులు అక్రమంగా సాగు చేసుకుంటున్నారు. అట్టి భూమి కర్రె సాయన్న, టంకర సాయన్న, మునెమ్మలకు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. దీనిపై ఇది వరకు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా రెవెన్యూ అధికారులు గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టాలని అర్హులకు హక్కులు కల్పించాలని కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు. అయినా తాసీల్దార్, డిప్యూటీ తాసీల్దార్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు విచారణ నిర్వహించి అర్హులకు భూమి ఇప్పించేందుకు చర్యలు తీసుకోవాలని లేనిచో రిలే నిరాహారదీక్షలకు పూనుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో భీమయ్య, చెన్నయ్య, రాములు, వెంకటయ్య, మునెయ్య, కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

తీగలాగితే.. డొంక కదిలింది!

- ఇందువాసి అక్రమ విరాసత్ దందా
- ఫోర్జరీ డెత్ సర్టిఫికెట్ సృష్టి
- పోలీసులకు ఫిర్యాదు చేయండి
- అదనపు కలెక్టర్ ఆదేశం

గట్టు, మార్చి 18 : తీగలాగితే డొంక కదిలింది అన్నట్లుగా ఉంది ఇందువాసి విరాసత్ వ్యవహారం, నిన్నటి వరకు తప్పుడు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌ను సంబంధం లేని వ్యక్తులు పొందిన విషయం తెలిసిందే. ఇదిలా వుండగా అసలు పట్టాదారు ముత్తయ్య పేరిట పొందిన మరణ ధృవీకరణ పత్రం కూడా తప్పుడుదేనని తెలుస్తోంది. ఆ ధృవీకరణ పత్రం జారీ చేసిన సమయంలో పనిచేసిన సదరు పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ తన హయాంలో తాను ఎలాంటి ధృవీకరణ పత్రాన్ని ముత్తయ్య పేరిట ఇవ్వలేదని తేల్చిచెబుతుండడం మరిన్ని అనుమానాలకు తావిస్తోంది. తాజాగా రెవెన్యూ యూనియన్ సభ్యులు పలువురు అదనపు కలెక్టర్(రెవిన్యూ) లక్ష్మీనారాయణను మంగళవారం కలిశారు. ఎంఆర్ఐ రాజును తప్పుదోవ పట్టించి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌ను పొందారని చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా స్పందించిన అదనపు కలెక్టర్ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ పొందడానికి ఎవరు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఎవరెవరి పాత్ర ఉందని ప్రశ్నిస్తూ దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని స్పష్టం చేసినట్లు తెలియవచ్చింది. ఈ ఘటనపై విచారణ చేయాలని కలెక్టర్, ఆర్డీవో స్థానిక తాసీల్దార్ సలీముద్దీన్‌ను ఆదేశించారు. ఈ పనిలో ఆయన నిమగ్నమయ్యారు. పూర్తి నివేదికను వారికి పంపనున్నట్లు తాసీల్దార్ స్పష్టం చేశారు.